

మాదాపూర్‌లో అమృత సంకల్ప్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమైనది

మాదాపూర్, జూన్ 13: మానసిక ఆరోగ్యానికి వన్ స్టాప్ వన్ సొల్యూషన్ సరైన మార్గమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మాదాపూర్‌లో అమృత సం కల్ప్ పేరిట ఏర్పాటు చేసిన క్లినిక్‌ను వైద్యుడు సురేంద్ర, సీఈఓ శిరీషతో కలిసి కేటీఆర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడు తూ మానసిక అనారోగ్యం అనేది సమస్య మాత్రమే కాదని, దానిని వెల్‌నెస్ లెన్స్ ద్వారా కూడా చూడాలన్నారు. ఈ మార్పునకు నాయకత్వం వహించడానికి డాక్టర్ సురేంద్ర ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో పాటు ముఖ్యమైనది అన్నారు. భావోద్వేగాన్ని పెంపొందించడంతో పాటు మానసిక అనారోగ్యానికి చికిత్స చేసే క్లినిక్ యొక్క సమగ్ర విధానాన్ని ఆయన ప్రశంసించారు. అమృత సంకల్ప్ మానసిక శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వడం, సమాజానికి తిరిగి ఇవ్వడం తమ మార్గం అని డాక్టర్ సురేంద్ర అన్నారు.

## 'గద్దర్ అవార్డులను ఆపాలి'

చిక్కడపల్లి, జూన్ 13: హైకోర్టు నోటీస్‌ని స్వాగతిస్తున్నామని, ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఆపాలని తెలంగాణ సినిమా వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం చిక్కడపల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వేదిక గౌరవ అధ్యక్షుడు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, రాష్ట్ర కన్వీనర్ లారా, కో కన్వీనర్ మోహన్ మాట్లాడారు. తెలంగాణ సినిమా వేదిక ఆధ్వర్యంలో గద్దర్ అవార్డులను ఆపమని తెలంగాణ హైకోర్టును ఆశ్రయించామని, పిటిషన్‌ని స్వీకరించిన కోర్టు, విచారణకు ఆదేశించిందని తెలిపారు. ప్రభుత్వానికి ఏ మాత్రం నైతికత ఉన్నా హైకోర్టులో గద్దర్ అవార్డుల గురించి తేలే దాకా అవార్డులను ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర నాయకులు రవి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

## 16న అప్రెంటిస్ షిప్ మేళా

సిటీ బ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): మల్లేపల్లిలోని ఐటీఐ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని నిజాంకాలేజి గ్రౌండ్స్ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజ్ ఆఫ్ లా లో ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16న ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ మేళాలో అంతర్జాతీయ సంస్థలు, మహారత్న, నవ రత్న, మినీ రత్నతో పాటు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు పాల్గొననున్నట్లు చెప్పారు. ఈ సంస్థల్లో ఉద్యోగ నియామకాలు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 7799472000, 9985490144,9666274708 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలి

వికారాబాద్, జూన్ 13: ప్రణాళిక ప్రకారం మున్సిపల్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని హైదరాబాద్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం 100 డేస్ కార్యక్రమంలో భాగంగా జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ వికారాబాద్ ను సందర్శించారు. ఇందులో భాగంగా కార్తికేయ నగర్ లో మొక్కలు నాటారు. డంపింగ్ యార్డ్ లోని పలు పనులను పరిశీలించారు. మున్సిపల్ లో జరుగుతున్న పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



కార్తికేయ నగర్ లో మొక్కలు నాటుతున్న జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్

## రీవాల్యుయేషన్ కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ దూరవిద్య కేంద్రమైన ప్రొఫెసర్ జి రామ్ రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్ సీడీఈ) ద్వారా అందించే కంప్యూటర్ అప్లికేషన్స్ డిప్లొమా కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్, అడ్వాన్స్ డిప్లొమా ఇన్ కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సుల పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్కు ఒక్కో పేపర్ కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో 19వ తేదీ వరకు టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్ కు రూ. 1000 చొప్పున చెల్లించి ఈ నెల 17వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

## వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్ ఆఫ్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్, ఐడీ) మూడో సెమిస్టర్ రెగ్యులర్, ఎంఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్, బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) (ఐడీ, ఐ, డీ, హెచ్ఐ, ఏఎస్డీ) మూడు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.



## 'పల్లా'కు పరామర్శ

వికారాబాద్ : కాలుకు శస్త్ర చికిత్స జరిగి, హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్ లో ఉన్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి తో కలిసి శుక్రవారం వికారాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ మెతుకు ఆనంద్ పరామర్శించారు.

## సీఎం కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

ఆదిబట్ల, జూన్ 13:ఈనెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని రైతు వేదికలు ప్రారంభిస్తున్నందున అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ సి నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వ్యవసాయ, ఉద్యానవన, ఆర్డీవోలు, మండల స్థాయి అధికారులతో రైతు భరోసా, రైతు వేదికలు ప్రారంభ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లాలో 23 రైతు వేదికలు ఉండగా సోమవారం 16న రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని రైతు భరోసా, మిగతా 35 రైతు వేదికలను కూడా లాంఛనంగా ప్రారంభిస్తారని దానికి సంబంధించి ఆయా డివిజన్ రెవెన్యూ అధికారులు ఎంపీడీవోలు, మండల వ్యవసాయ అధికారులు పెద్ద ఎత్తున రైతులు హాజరయ్యే విధంగా చూడాలని కలెక్టర్ అన్నారు. రైతువేదికలను అందంగా అలంకరణ చేస్తూ, షామియానాలు, కుర్చీలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గ్రామాల నుండి రైతులు వచ్చేందుకు తగిన ఏర్పాట్లు మండల వ్యవసాయ అధికారులు ముందే ప్రణాళికను సిద్ధం చేయాలని ఆ మండలాల్లో అందరూ రైతులు వేదికల వద్దకు వచ్చేటట్లు తగిన విధంగా మండల ప్రత్యేక అధికారులు శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ముఖ్యమంత్రి రైతులతో ముఖా ముఖి మాట్లాడతారని దానికి సంబంధించి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఉద్యానవన శాఖ అధికారి, ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఆయా వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలి

సిటీబ్యూరో, జూన్13, (నమస్తే తెలంగాణ): చింతల్ బస్తీ వద్ద ధ్వంసమైన 300 ఎంఎం డయా మెయిన్ పైప్‌లైన్ అత్యవసర మరమ్మతు పనులను జలమండలి ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని అధికారులతో చర్చించారు. స్థానికులకు నీటిసరఫరా ఇబ్బంది తలెత్తకుండా వెంటనే మరమ్మతులు పనులు పూర్తిచేసి సరఫరాను పునరుద్ధరణ చేయాలని సూచించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

సిటీ బ్యూరో, జూన్ 13 (నమస్తే తెలంగాణ): నేరేడ్‌మెట్‌ని ప్రభుత్వ డైట్ కళాశాల ఉర్దూ మీడియంలో బోధన, బోధనేతర సిబ్బంది తాత్కాలిక ప్రాతిపదికన నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సోషల్ స్టడీస్, ఉర్దూ లాంగ్వేజ్, లలిత కళలు, ప్రదర్శనలు విభాగాల్లో ఒక్కొక్క పోస్టు ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, ఎంఈడీ తప్పనిసరిగా ఉండాలని, వయస్సు 65 ఏండ్లకు మించరాదని అన్నారు. వేతనం నెలకు రూ.23,400 ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తులు ఈనెల 19లోపు కళాశాలలో అందజేయాలని వెల్లడించారు.

## కార్లు అద్దెకు తీసుకుని..అమ్మేశాడు

### నిందితుడిపై చీటింగ్ కేసు నమోదు

బంజారాహిల్స్,జూన్ 13: కార్లను అద్దెకు తీసుకుని పక్క రాష్ట్రంలో విక్రయించిన వ్యక్తిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదయింది. వివరాల్లోకి వెళ్తే.. అత్తాపూర్‌కు చెందిన రషీద్ బంజారాహిల్స్‌లో కార్యాలయం పెట్టి కార్లను లీజుకు ఇస్తుంటాడు. గత ఏడాది నవంబర్‌లో అతని వద్ద బండ్లగూడకు చెందిన మహ్మద్ జాహెద్ అలీ.. డిఫెండర్, ఫోర్డ్ ఎండీవర్ కార్లను అద్దెకు ఇచ్చాడు. నెలనెలా జాహెద్ అద్దె చెల్లిస్తున్నాడు. అయితే ఇటీవల జాహెద్ .. మహారాష్ట్రకు వెళ్లి అద్దెకు తీసుకున్న రెండుకార్లను ఇతరులకు విక్రయించాడు. కాగా.. మహారాష్ట్రలో కార్లు విక్రయిస్తుండగా జాహెద్‌ను అక్కడి పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో బంజారాహిల్స్ నుంచి రెండు కార్లను తెచ్చి అమ్మేసినట్లు చెప్పాడు. దీంతో వారు రషీద్‌కు సమాచారం ఇచ్చారు. తన నుంచి కార్లు అద్దెకు తీసుకుని విక్రయించిన జాహెద్‌పై కార్ల యజమాని శుక్రవారం బం జా రాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# గాంధీ.. ఏందీ దుస్థితి?

## సమస్యల వలయంలో గాంధీ ఆసుపత్రి

సిటీబ్యూరో, జూన్13,(నమస్తే తెలంగాణ): గాంధీ జనరల్ ఆసుపత్రి.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియనివారంటూ ఉండరు. ఎంతపెద్ద రోగమైన గాంధీ మెట్లెక్కితే చాలు ఆరోగ్యవంతంగా తిరిగొస్తామనే ధీమా ఉండేది. కానీ అదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం గాంధీ అంటేనే సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సకాలంలో క్లిష్టమైన వైద్య సేవలందించడంలో రోజురోజుకు విఫలమవుతున్నది. ఏఎంసీ వార్డులో వెంటిలేటర్లు కూడా అమర్చలేని స్థితికి నేడు ఈ ఆసుపత్రి చేరింది. ఏఎంసీ వార్డులోనే కొవిడ్ రోగులను, ఇతర రోగులతో కలిపి వైద్యమందిస్తుండటం ఆందోళనను రేకెత్తిస్తున్నది.

### తూతూ మంత్రంగా వైద్య సేవలు..

1200 పడకలు గల ఈ ఆసుపత్రిలో సరిపడా సిబ్బంది లేకపోవడం ఒక కారణమైతే, క్రిటికల్ ట్రీట్‌మెంట్ అందించే రోగులకు నాణ్యమైన వైద్యమందించకపోవడం మరో కారణం. గాంధీ ఆసుపత్రిలో మూడో ఫ్లోర్‌లో ఉన్న అక్యూట్ మెడికల్ కేర్(ఏఎంసీ) వార్డులో తీవ్రమైన అస్వస్థతకు గురైన వారికి వెంటిలేషన్‌పై చికిత్సనందిస్తుంటారు. శ్వాసకోశ సమస్యలు, లివర్ సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతూ, తీవ్రమైన అస్వస్థతకు గురైన వారందరికీ ఏఎంసీ వార్డులోనే వెంటిలేటర్‌పై అత్యవసర వైద్యమందిస్తారు 68 పడకలకు గాను కేవలం 23 మాత్రమే వెంటిలేటర్లు ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బయోమెడికల్ ఇంజినీర్ గతంలో వాటిని ఎప్పటికప్పుడు సర్వీస్ చేస్తుండేవారు. ప్రస్తుతం ఆ పోస్టు ఖాళీగా ఉండటంతో పాడైపోయిన మెషిన్లను స్టోర్ రూంకు పరిమితం చేశారు. మరోవైపు రోగులు తీవ్రమైన శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడుతూ వెంటిలేటర్ సహాయం కోసం ఎదురుచూసినా ఫలితం శూన్యంగా మారింది. కేవలం 23 మందికే ఆ సేవలందిస్తూ, మిగతా వారిని క్యాజ్‌వాలిటీలోనే పెట్టి తూతూ మంత్రంగా వైద్యమందిస్తున్నారు.




- ఏఎంసీ వార్డులో పనిచేయని వెంటిలేటర్లు
- 68 పడకలకు 23 వెంటిలేటర్లే దిక్కు..
- కొవిడ్, ఇతర రోగులతో కలిపే చికిత్స
- మాస్కులు, శానిటేషన్ దేవుడెరుగు

### కొవిడ్ రోగులను అందులోనే..

గాంధీ ఆసుపత్రి కొవిడ్ నోడల్ కేంద్రంగా కూడా వైద్యసేవలందిస్తుంది. ఇప్పటికే కొవిడ్ వచ్చినా కూడా తట్టుకుంటామని 30 పడకలతో కొవిడ్ వార్డును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో కొవిడ్ కమిటీ సైతం ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా కొవిడ్ లక్షణాలతో గాంధీకి వచ్చే రోగులను కొవిడ్ వార్డులో ఉంచి వైద్యమందించకుండా ఏఎంసీ వార్డులో పెట్టి వైద్యమందించడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. ఇతర రోగులు సైతం భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ఇద్దరు కొవిడ్ రోగులను ఏఎంసీ వార్డులో పెట్టి వైద్యసేలందిస్తున్నారు. అసలే శ్వాస సంబంధిత వ్యాధులతో వచ్చేవారు అధికంగా ఉన్న వార్డది. అలాంటి వారితో కొవిడ్ బాధితులు ఉంటే పెనుప్రమాదమే పొంచి ఉంటుంది. వారినుంచి ఇతర రోగులకు వ్యాప్తి చెంది వారి ప్రాణాలకే ముప్పువాటిల్లుతుంది. మరోవైపు వైద్యసేవలందించేవారికి కనీసం సరిపడ మాస్కులు, శానిటేషన్ కూడా ఇవ్వకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గడిచిన నాలుగు నెలల్లో గాంధీ ఆసుపత్రిని వైద్యారోగ్యశాఖ మంత్రి ఒక్కసారి, డీఎంఈ ఐదుసార్లకు పైగా పర్యటించారు. ఇప్పటికైనా సమస్యలను గుర్తించి చర్యలు చేపట్టాలని రోగుల బంధువులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


## ఇక ఓయూ సందర్శన ఈజీ



క్యూఆర్ కోడ్ బేస్డ్ నావిగేషన్ విధానాన్ని ఆవిష్కరిస్తున్న ఓయూ అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రతిష్టాత్మక ఓయూను సందర్శించేవారి సౌలభ్యం కోసం ఉస్మానియా టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ (ఓటీబీఐ) ఆధ్వర్యంలో నూతనంగా క్యూఆర్ కోడ్ బేస్డ్ నావిగేషన్ విధానాన్ని రూపొందించారు. దీనిని అధికారులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ క్యాంపస్‌లో వివిధ కళాశాలలు, విభాగాలు, పరిశోధన కేంద్రాలు, కార్యాలయాలు, హాస్టల్స్ కు చేరుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. దాదాపు 400 కీలక లొకేషన్లను ఇందులో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. త్వరలోనే రాష్ట్రంలోని 100 గ్రామాల లొకేషన్ లను ఈ విధానంలో పొందపరచనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్, ఓటీబీఐ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాసాగర్, సలహాదారు ప్రొఫెసర్ హరినారాయణ పాల్గొన్నారు.

## లైఫ్ స్టైల్ఎండ్ ఆఫ్ సీజన్ సేల్ ప్రారంభం




సిటీబ్యూరో, జూన్13, (నమస్తే తెలంగాణ): దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ ప్రపంచానికి నెలవైన లైఫ్ స్టైల్ ఎండ్ ఆఫ్ సీజన్ సేల్ మొదలుపెడుతోంది. ఇది షాపర్లకు ఫ్యాషన్-ఫార్వర్డ్ ప్రొడక్ట్‌ల వైడ్ రేంజ్‌లపై 50శాతం వరకు తగ్గింపును అందిస్తోంది. అంతేకాదు, హెచ్డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డ్ ఉన్న వారి కోసం 10శాతం తగ్గింపును అందిస్తుంది. ఈ సీజన్‌లో ఈ ప్రచారం మరింత ఊపందుకొనేలా ప్రత్యేకంగా తమన్నా భాటియాతో జట్టుకడుతోంది.

## మా భూములను కాంగ్రెస్ నేతలు కబ్జా చేస్తున్నారు

### న్యాయం చేయాలంటున్న బాధితులు

ఖైరతాబాద్, జూన్ 13 : వారసత్వంగా వచ్చిన భూములను స్థానికంగా ఉండే కొందరు కాంగ్రెస్ నేతలు కబ్జాకు యత్నిస్తున్నారంటూ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్ మండలం, వేంపల్లి గ్రామానికి చెందిన బాధితులు వాపోయారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైతు ముప్పిడి భాస్కర్ మాట్లాడుతూ వేంపల్లి గ్రామంలో సర్వే నంబర్ 374లో నాలుగు గుంటల భూమి ఉందని, అది తన తండ్రి ద్వారా సంక్రమించిందన్నారు. కొంత కాలంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు సత్యనారాయణ తమ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని వాపోయాడు. పోలీసులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అదే గ్రామానికి చెందిన మరో బాధితుడు మల్లేశ్ మాట్లాడుతూ సర్వే నంబర్ 299 లో ఎస్సీ కాలనీలో గతంలో ప్రభుత్వం పది గుంటల భూమిని తన తండ్రికి ఇచ్చిందని, వారసత్వంగా ప్రస్తుతం ఆ భూమిని తాను సాగుచేసుకుంటున్నానని తెలిపారు. సత్యనారాయణ తప్పుడు ధ్రువ పత్రాలు సృష్టించి భూమిని కబ్జా చేశాడని, తన స్థలంలోకి వెళ్లకుండా అనుచరులతో కలిసి దౌర్జన్యానికి పాల్పడుతున్నాడన్నారు. కబ్జాదారుల నుంచి తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని తెలిపారు. మరో బాధితుడు అబ్దుల్ జబ్బార్ మాట్లాడుతూ సర్వేనంబర్ 352/ఆ/2, 352/ఈ లో సుమారు ఎకరం భూమి ఉందని, దానిని కబ్జా చేయడమే కాకుండా అందులో నిర్మాణాలను సైతం చేపట్టారని, స్థానిక తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. సీఎం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.




భూమి పత్రాలను చూపిస్తున్న బాధితులు



## కలెక్టర్ గౌతమ్‌కు ఘన వీడ్కోలు

మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 13: కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి, సింగరేణి కాలరీస్ డైరెక్టర్‌గా బదిలీ అయిన గౌతమ్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, రాధికాగుప్త, డీఆర్వో హరిప్రియ, కలెక్టరేట్ ఏవో రాంమోహన్, ఆర్‌డీఓలు వెంకట ఉపేందర్‌రెడ్డి, శ్యామ్ ప్రకాశ్, వివిధ శాఖల అధికారులు గౌతమ్‌కు శాలువాలు కప్పి పూల మొక్కలు అందజేశారు.

## క్యాన్సర్ ఆస్పత్రి వ్యవస్థాపక దినోత్సవానికి రండి

### గవర్నర్‌ను ఆహ్వానించిన ఎండీ నందమూరి బాలకృష్ణ



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన నందమూరి బాలకృష్ణ

బంజారాహిల్స్.జూన్ 13: బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి 25వ వ్యవస్థాపక దినోత్సవానికి రావాలంటూ ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణతో పాటు పాలకమండలి సభ్యులు శుక్రవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మని కలిసి ఆహ్వానించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ 25 ఏండ్ల క్రితం ప్రారంభించిన బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా అనేకమంది పేదలకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్నామని, క్యాన్సర్ చికిత్సలో అత్యాధునిక విధానాలను ప్రవేశపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సభ్యులు జేఎస్‌ఆర్ ప్రసాద్, సీఈవో డా. కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఫార్మా ఉద్యోగులకు శిక్షణ

ఖైరతాబాద్, జూన్ 13 : ఫార్మా కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకు నైపుణ్యాభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆర్ గ్రో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎండీ నఖీ అబ్బాస్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శిక్షణ తరగతులకు సంబంధించిన బ్రోచర్లను కార్యక్రమ నిర్వాహకులు వనితా కట్టర్, రాఘవ గూడూరు, కల్యాణ చక్రవర్తితో కలిసి ఆవిష్కరించారు. నఖీ అబ్బాస్ మాట్లాడుతూ ఫార్మా కంపెనీల్లో పనిచేసే ప్రొడక్షన్ ఇంజినీర్, క్వాలిటీ ఎస్యూరెన్స్, క్వాలిటీ కంట్రోల్, వేర్హౌజ్, ఈహెచ్ఎస్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు నేటి నుంచి టీహబ్‌లో 21 రోజుల పాటు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

# రక్తదాతలు..ప్రాణదాతలు

- రక్తసేకరణలో మొదటి స్థానంలో నిమ్స్ , రెండో స్థానంలో గాంధీ
- రక్తదానంపై పెరుగుతున్న అవగాహన
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



సిటీబ్యూరో, జూన్13, (నమస్తే తెలంగాణ): ప్రాణాపాయంలో ఉన్నవారికి మనం చేసే గొప్పసాయం ఏదైనా ఉందంటే అది కేవలం రక్తమిచ్చి వారి ప్రాణాలు కాపాడటమే. చాలామంది ప్రమాదాల భారీన పడినప్పుడు సకాలంలో కావాల్సిన రక్తం లభించకపోవడంతో ప్రాణాలు సైతం కోల్పొతున్నారు. అందుకే ప్రాణాపాయ స్థితిలో ఉండి రక్తం కోసం ఎదురుచూసే వారికి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం మన మొదటి కర్తవ్యం. ప్రభుత్వాలు సైతం ప్రజల్లో రక్తదానం గురించి అనేక క్యాంపులు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నాయి. అందులో భాగంగా ఏటా జూన్14 న 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం' నిర్వహిస్తూ, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాది ఓ థీమ్‌తో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఈ సారి సైతం..'రక్తదానం చేయండి, భరోసా నివ్వండి, కలిసికట్టుగా ప్రాణాలు కాపాడుదాం' అనే థీమ్‌తో ముందుకు సాగుతుండటం గమనార్హం.

### మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఏర్పాటు..

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 296 రక్తనిధి కేంద్రాలు ఉండగా వాటిలో 53 ప్రభుత్వానివే కావడం గమనార్హం. 53 రక్తనిధి కేంద్రాల్లో 26 కేంద్రాలు కాంపోనెంట్ బ్లడ్ సెంటర్లుగా రక్తసేకరణ, పంపిణీ చేస్తుండటం గమనార్హం. హైదరాబాద్ జిల్లాలో నిలోఫర్, ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, గాంధీ జనరల్ ఆసుపత్రి, సుల్తాన్‌బజార్ మెటర్నిటీ, పేట్లబుర్జ్, నాంపల్లి ఏరియా ఆసుపత్రి, ఎంఎన్‌జే, కింగ్‌కోటీ జిల్లా ఆసుపత్రి, నారాయణగూడలోని ఐపీఎం లలో బ్లడ్ బ్యాంక్ సెంటర్లు ఉండగా, రంగారెడ్డిలో కొండాపూర్‌లోని జిల్లా ఆసుపత్రి, షాద్‌నగర్‌లోని ఏరియా ఆసుపత్రి కేంద్రంగా ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో సైతం రెండు కేంద్రాల్లో రక్తనిధి కేంద్రాలు ఉన్నాయి. రక్తనిధి కేంద్రాల్లో నిమ్స్, గాంధీ, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రులు ముందు వరసలో ఉండి అవసరమున్న వారికి ఉచితంగా రక్తాన్ని ఇస్తున్నారు. సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్న ఎంతో మంది రోగులను చూసి కేఎంసీ విద్యార్థులు చలించిపోయారు. అలాంటివారిలో కనీసం కొంత మంది ప్రాణాలైనా కాపాడాలని తలిచారు. కాకతీయ మెడికల్ కాలేజీలో 2021 బ్యాచ్‌కు చెందిన మెడికల్ విద్యార్థి కందుల లోకేశ్ కుమార్, 2022 బ్యాచ్‌కు చెందిన చల్ల నవనీత్ ఆలోచనల్లోంచి పుట్టిందే మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్. ఈ క్లబ్‌ద్వారా ఇప్పటివరకు 1000 మందికి రోగులకు రక్తదానం చేశారు.

### రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

18ఏళ్ల పైబడి ఆరోగ్యవంతంగా ఉన్న వారు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి. మీరిచ్చే రక్తం వల్ల ఓ ప్రాణాన్ని కాపాడిన వారమవుతాం. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అపోహలు లేకుండా ఆరోగ్యవంతంగా ఉంటారు. ముఖ్యంగా యువత ముందుకు రావాలి. ఇతరులకు సైతం అవగాహన కల్పించాలి.

– డాక్టర్ అమర్‌సింగ్, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్, స్టేట్ బ్లెడ్ సెల్స్ అధికారి